తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్

సోమవారం

10 ఆగస్టు 2026



# ఖాళీగా మున్సిపల్ వార్డు కార్యాలయం

## సబ్ రిజిస్టర్ కార్యాలయం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి





**జడ్చర్ల, ఆగస్టు 9 (జనంసాక్షి):** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఒకప్పుడు జడ్చర్ల, కావేరమ్మపేట గ్రామ పంచాయతీగా, బాదేపల్లి గ్రామ పంచాయతీగా వేరువేరుగా కొనసాగుతున్న ఈ ప్రాంతాలను కలిపి ప్రభుత్వం జడ్చర్ల మున్సిపాలిటీగా ఏర్పాటు చేసింది. అయితే మూడు గ్రామాలు కలిసి ఒకే మున్సిపాలిటీ అయినప్పటికీ, పరిపాలనా సౌలభ్యం పేరిట దాదాపు అన్ని ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలను కేవలం బాదేపల్లి ప్రాంతంలోనే ఏర్పాటు చేశారు. కావేరమ్మపేట, జడ్చర్ల ప్రాంతాలలో ఏ ఒక్క ప్రభుత్వ కార్యాలయం లేకపోవడం గమనార్హం. తాజాగా బాదేపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో నూతన మున్సిపల్ కార్యాలయ భవనం నిర్మాణం పూర్తి కావడంతో, కార్యాలయం అక్కడికి తరలివెళ్లింది. దీంతో గతంలో కావేరమ్మపేటలో మున్సిపల్ వార్డు కార్యాలయం గా కొనసాగిన భవనం ప్రస్తుతం పూర్తిగా నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం బాదేపల్లి గంజి ప్రాంతంలో అద్దె భవనంలో కొనసాగుతున్న జడ్చర్ల సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని ఖాళీగా ఉన్న మున్సిపల్ వార్డు కార్యాలయం భవనంలోకి మార్చాలని జడ్చర్ల, కావేరమ్మపేట ప్రాంత ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ప్రజల ప్రధాన ఆకాంక్షలు:

బాదేపల్లి గంజి ప్రాంతంలో అద్దె భవనంలో కొనసాగుతున్న సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని కావేరమ్మపేటలో ఖాళీగా ఉన్న మున్సిపల్ వార్డు కార్యాలయ భవనంలోకి మార్చడం ద్వారా ప్రభుత్వ ఖజానాకు అద్దె భారం తప్పుతుంది. అన్ని ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు బాదేపల్లి ప్రాంతానికే పరిమితం కాకుండా, కావేరమ్మపేట, జడ్చర్ల ప్రాంతాలలో ఏర్పాటుచేసి ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకురావాలి. ఖాళీగా ఉన్న మున్సిపల్ భవనాన్ని పాడుబడకుండా ఉపయోగకరమైన ప్రభుత్వ కార్యాలయంగా మార్చి ప్రజా ప్రయోజనాలకు అంకితం చేయాలి.

స్థానికుల అభిప్రాయం:

**అద్దె భవనాల భారం తప్పుతుంది:**



అన్ని కార్యాలయాలు బాదేపల్లి వైపే కేంద్రీకృతమయ్యాయి. కావేరమ్మపేటలో ఏ ఒక్క ప్రభుత్వ కార్యాలయం కూడా లేదు. ఇక్కడ ఖాళీగా ఉన్న పాత మున్సిపల్ భవనంలోకి సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని మారుస్తే ప్రభుత్వానికి అద్దె భవనాల భారం తప్పుతుంది, ప్రజలకూ రవాణా కష్టాలు తీరుతాయి.

**- ఎస్. బాలరాజు, కావేరమ్మపేట.**

**అందరికీ సౌకర్యంగా ఉంటుంది:**

రిజిస్ట్రేషన్ పనుల కోసం బాదేపల్లి గంజి ప్రాంతంలోని అద్దె భవనానికి వెళ్లాలంటే వృద్ధులకు, మహిళలకు చాలా ఇబ్బందిగా ఉంటోంది. కావేరమ్మపేటలోని భవనం విశాలంగా ఉంది కాబట్టి అక్కడే సబ్ రిజిస్టర్ ఆఫీస్ ఏర్పాటు చేస్తే అందరికీ ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

**- పి. సురేష్, జడ్చర్ల.**

**ప్రజా ప్రతినిధులు స్పందించాలి:**



ప్రభుత్వ ఆస్తులు నిరుపయోగంగా మారడం సరికాదు. కావేరమ్మపేటలో మూతపడిన భవనంలో సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని ప్రారంభిస్తే ఈ ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుంది. స్థానిక ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి ఈ సమస్యపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలి.

**- కే.శేఖర్, జడ్చర్ల.**

**అన్ని ప్రాంతాలకు సమన్యాయం జరగాలి:**



మూడు గ్రామాలను కలిపి మున్సిపాలిటీ చేసినప్పుడు అన్ని ప్రాంతాలకు సమన్యాయం జరగాలి. కేవలం ఒకే ప్రాంతానికి కార్యాలయాలు పరిమితం కాకుండా, ఖాళీగా ఉన్న భవనాలను సద్వినియోగం చేసుకోవాలి. సబ్ రిజిస్టర్ ఆఫీస్‌ను కావేరమ్మపేటకు మార్చే వరకు అవసరమైతే అందరం కలిసి వినతిపత్రాలు అందజేస్తాం.

**- సందీప్, జడ్చర్ల.**



## "చదువుకు పేదరికం, కులం అడ్డుకాదు"

- విద్యార్థుల అవార్డుల ప్రధానోత్సవంలో మాజీ మంత్రి హరీష్ రావు



**సిద్దిపేట బ్యూరో, ఆగస్టు 09(జనంసాక్షి):** సిద్దిపేటలో నవజీవన్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ (న్యూస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రతిభ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పదవ తరగతి లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన దళిత విద్యార్థులకు అవార్డులు అందజేసి, వారిని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హరీశ్‌రావు మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ లాంటి మహనీయులు కల్పించిన రిజర్వేషన్ల వల్లే మనమంతా చదువుకుని ఉన్నత స్థానాల్లో ఉన్నామన్నారు. ఆ రిజర్వేషన్ల ఫలాలతో గౌరవంగా బతుకుతున్న మనం తిరిగి సమాజానికి ఏదో ఒకటి చేయాలనే బాధ్యతను పదేళ్ల క్రితమే గుర్తించి సిద్దిపేటలో మాదిగ సామాజిక వర్గం ఉద్యోగులంతా కలిసి 'న్యూస్' సొసైటీని స్థాపించడం అభినందనీయమన్నారు.


నాకు సమాజం ఏం చేసింది అని అడిగేవాళ్లే ఎక్కువ ఉన్న ఈ రోజుల్లో, మేము సమాజానికి ఏం చేయగలం అని ఆలోచించి, ఉద్యోగులు తమ వేతనం నుంచి ప్రతినెలా వెయ్యి రూపాయలు పక్కనపెట్టి 10 లక్షల రూపాయల నిధిని ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. ఫీజులు కట్టలేని పేద విద్యార్థులకు అండగా నిలబడుతూ, ప్రతి సంవత్సరం స్కాలర్షిప్స్ ఇవ్వడం రాష్ట్రానికే ఆదర్శమన్నారు. ఐదేళ్ల క్రితం ఫీజు కట్టలేక నా దగ్గరకు వచ్చిన హౌసింగ్ బోర్డుకు చెందిన రోహిత్ అనే అబ్బాయికి నేను సహాయం చేశాను. ఇప్పుడు ఆ అబ్బాయికి ఏడాదికి 6 లక్షల జీతం వస్తోంది. తన తొలి ఏడాదంతా సంపాదించిన 6 లక్షల రూపాయలను తీసుకొచ్చి తిరిగి పేద విద్యార్థుల కోసం ఖర్చు చేయమని నాకే ఇచ్చాడు. కష్టపడి పైకొచ్చిన ఆ అబ్బాయి ఆలోచనా విధానం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. శ్రీజ అనే దళిత విద్యార్థినికి ఎంబీబీఎస్ సీటు వస్తే ఫీజు కట్టలేని పరిస్థితిలో నా దగ్గరకు వచ్చింది. ఐదేళ్ల పాటు ఆమె ఫీజు నేనే కడతానని మాట ఇచ్చాను. గత ఏడాది ఫీజు కట్టాను. ఈరోజు మీ అందరి సమక్షంలో ఆమె రెండో సంవత్సరం ఫీజును కూడా చెల్లిస్తున్నానన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధించి, ఫీజు కట్టలేక ఇబ్బంది పడే దళిత బిడ్డలు ఎవరైనా నా దృష్టికి వస్తే వాళ్ళను డాక్టర్లను చేసే బాధ్యత నేను తీసుకుంటాను. మంచి కార్యక్రమాలు చేస్తున్న న్యూస్ సొసైటీకి నా వంతు సహాయంగా ఈ సంవత్సరం కూడా లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేస్తున్నాను.

మిగతా 6లో..

## ఈనెల 12న

## నాగర్‌కర్నూలులో ఉచిత కంటి చికిత్స శిబిరం

**నాగర్‌కర్నూల్, ఆగస్టు 9 (జనంసాక్షి):**



జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీ, రామకృష్ణ టాకీస్ రోడ్డులో గల శోభ ఆప్టికల్ లో ఈనెల 12న బుధవారం నాడు ఉదయం 9గంటలకు ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ ఆప్తాలమిక్ ఆఫీసర్ బి.శివారెడ్డి తెలిపారు.

ఈ శిబిరంలో రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి, క్యాటరాక్ట్ పోరగల వారినీ ప్రత్యేక అంబులెన్స్ ద్వారా లయన్ రాంరెడ్డి కంటి ఆసుపత్రి,ఎనుగొండ, మహబూబ్‌నగర్ కి పంపించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనునట్లు తెలిపారు.

రోగులకు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా రక్తపరీక్షలు, సాధారణ పరీక్షలు, ప్రతిరోజు నిర్వహిస్తారని తెలిపారు.

శిబిరానికి వచ్చే ముందు ఆధార్ కార్డు, ఓటర్ కార్డ్, లేదా రేషన్ కార్డ్ జిరాక్స్ కాపీని వెంట తెచ్చుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కు 9440454284, 8106333324 నెంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

## గిరిజన గురుకులాల్లో పార్ట్‌టైమ్ ఉపాధ్యాయుల నియామకం

- రీజినల్ కోఆర్డినేటర్ నర్సింగ్ రావు

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 9(జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2026–27 విద్యా సంవత్సరానికి పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ నర్సింగ్‌రావు తెలిపారు. డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్, పీజీటీ, టీజీటీ, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.

**డిగ్రీ లెక్చరర్ పోస్టులు...**

సంగారెడ్డి డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, బోటనీ, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు చొప్పున ఖాళీలు ఉన్నాయని తెలిపారు.

**జూనియర్ లెక్చరర్ పోస్టులు...**

ప్రతిభా జూనియర్ కళాశాల (బాలురు)లో కామర్స్, మానూర్ ఎట్ కరాస్ గుత్తి పాఠశాల అలాగే జూనియర్ కళాశాల (బాలికలు)లో మ్యాథ్స్, నారాయణఖేడ్ పాఠశాల, జూనియర్ కళాశాల (బాలురు)లో జువాలజీ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు చొప్పున ఖాళీలు ఉన్నాయి .

**పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్...**

**(పిజిటి) పోస్టులు...** సిర్గాపూర్ పాఠశాల, జూనియర్ కళాశాల (బాలికలు)లో మ్యాథ్స్, కంగ్టి పాఠశాల , జూనియర్ కళాశాల (బాలురు)లో ఫిజికల్ సైన్స్, బయో సైన్స్, సోషల్ స్టడీస్, మానూర్



ఎట్ కరాస్ గుత్తి పాఠశాల, జూనియర్ కళాశాల (బాలికలు)లో సోషల్ స్టడీస్ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు చొప్పున ఖాళీలు ఉన్నాయి.

**(టిజిటి) పోస్టులు...** నారాయణఖేడ్ పాఠశాల , జూనియర్ కళాశాల (బాలురు)లో ఇంగ్లీష్, కంగ్టి పాఠశాల , జూనియర్ కళాశాల (బాలురు)లో ఇంగ్లీష్, సోషల్ స్టడీస్, జిన్నారం పాఠశాల, జూనియర్ కళాశాల (బాలురు)లో మ్యాథ్స్, మానూర్ ఎట్ కరాస్ గుత్తి పాఠశాల, జూనియర్ కళాశాల (బాలికలు)లో మ్యాథ్స్ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు చొప్పున మానూర్ ఎట్ కరాస్ గుత్తి పాఠశాల, జూనియర్ కళాశాల (బాలికలు)లో సోషల్ స్టడీస్‌లో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదేవిధంగా జిన్నారం పాఠశాల, జూనియర్ కళాశాల (బాలురు)లో స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ (పిడి) పోస్టు ఒక్కటి ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

మిగతా 6లో..

# బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే జీఎంఆర్

• అమ్మవారికి ప్రత్యేక పూజలు



**రామచంద్రాపురం,ఆగస్టు9(జనంసాక్షి):** ఆషాఢమాసం సందర్భంగా రామచంద్రాపురం డివిజన్‌లోని వివిధ కాలనీల్లో ఆదివారం నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తోందన్నారు. ఆషాఢమాసంలో అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలవడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు. బోనాల సందర్భంగా ప్రజలు ఐక్యంగా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

అనంతరం ఆలయ కమిటీలు, ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వీరన్నపేటలో ఘనంగా దివంగత నాయకుడి ప్రథమ వర్ధంతి

• నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి



**చేర్యాల, ఆగస్టు 09 (జనంసాక్షి):** చేర్యాల మండలం వీరన్నపేట గ్రామంలో దివంగత మాజీ ఉపాధ్యాయులు, మాజీ ఎంపీటీసీ ఆరెళ్ళ పాపయ్య గౌడ్ ప్రథమ వర్ధంతి కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కొమ్మూరి ప్రతాపరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై దివంగతుల చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజ సేవకు, ప్రజల సంక్షేమానికి అంకితభావంతో పనిచేసిన దివంగతుల సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. వారు చూపిన సేవా మార్గాన్ని నేటి తరాలు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చేర్యాల మండల అధ్యక్షులు మంజ మల్లేశం, చేర్యాల పట్టణ అధ్యక్షులు దాసరి శ్రీకాంత్, కొమురవెల్లి మండల అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్, మద్దూరు మండల భాస్కర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు సూర్న శ్రీకాంత్, గౌండ్ల శ్రీనివాస్ తో పాటు వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని దివంగతులకు ఘనంగానివాళులర్పించారు.

## రవీంద్రశర్మకు సహస్ర యాగ బిరుదు ప్రదానం



**తూప్రాన్, ఆగస్టు 9(జనంసాక్షి):** మెదక్ జిల్లా బ్రాహ్మణ సంఘం, జిల్లా సంఘం అధ్యక్షుడు శలాఖ రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో వేయి యజ్ఞాలు చేసిన దేవి ఉపాసకులు సోమయాజుల రవీంద్రశర్మకు సహస్ర యాగ బ్రహ్మ బిరుదు ప్రదానం చేశారు ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సమాఖ్య అధ్యక్షులు మోత్కురి రామేశ్వరరావు పాటు బ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## బోనాల పండుగలో పాల్గొన్న ఎమ్మెల్యే



**శివ్వంపేట,ఆగస్ట్9(జనంసాక్షి):** శివ్వంపేట మండలంలోని ఎమ్మెల్యే స్వగ్రామమైన గోమారం గ్రామంలో బోనాల పండుగను ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలోని గ్రామ దేవతలకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి బోనాలు సమర్పించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందన్నారు. గ్రామ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలపై అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రగౌడ్, ఎంపీపీ మాజీ ఉపాధ్యక్షులు వాకిటి హనుమంత్ రెడ్డి, నాయకులు కుంట లక్ష్మణ్, భిక్షపతి రెడ్డి, నవీన్, దేవేందర్, నగేష్, విజయ్ గౌడ్, వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి దంపతులు

• ఘనంగా సన్మానించిన ఆలయ కమిటీ సభ్యులు



**రామచంద్రాపురం, ఆగస్టు 9(జనంసాక్షి):** ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని రామచంద్రాపురం డివిజన్ పరిధిలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్సీ అంజిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ అంజిరెడ్డి దంపతులను సాదరంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా నాంచారమ్మకు బోనాలు



**అల్లాదుర్గం, ఆగస్టు 9 (జనంసాక్షి):** మండల కేంద్రమైన అల్లాదుర్గంలో ఆషాడమాసం సందర్భంగా నాంచారమ్మ దేవతకు బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని కాన్షిరాం నగర్ కాలనీ నుండి మహిళలు బోనాలు ఎత్తుకొని మంగళ హారతులు, డప్పు వాయిద్యాలతో , శివ సత్తుల పూనకాలతో ఊరేగింపుగా నాంచారమ్మ తల్లి దేవాలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సుభాష్ రావు, జిల్లా కాంగ్రెస్ ఎస్సి సెల్ ఉపాధ్యక్షులు బలరాం, డిసిసి కార్యదర్శి బాలకిషన్, శేఖర్ పటేల్, బాల్రాజ్ పాల్గొన్నారు.

# కుక్కలు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి.. ప్రధానోపాధ్యాయుడి మృతి

• చికిత్స పొందుతూ తుదిశ్వాస..
• ఉపాధ్యాయ వర్గాల్లో విషాదం



**కొల్చారం, ఆగస్ట్ 9 (జనంసాక్షి):** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ప్రధానోపాధ్యాయుడు మృతి చెందిన విషాద ఘటన ఆదివారం చోటుచేసుకుంది. కౌడిపల్లి మండలం సేరి తండాకు చెందిన రామచంద్రనాయక్ కుకుట్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు.

శనివారం మధ్యాహ్నం మెదక్ నుంచి కౌడిపల్లి వైపు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా కొల్చారం ఇండియన్ పెట్రోల్ పంప్ సమీపంలో అకస్మాత్తుగా కుక్కలు అడ్డుగా రావడంతో బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి.

వెంటనే 108 వాహనంలో మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం సూరారంలోని మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం రామచంద్రనాయక్ మృతి చెందారు. మృతుడి కుమారుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొల్చారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామచంద్ర నాయక్ గత ఏడాది వరకు కొల్చారం మండలంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించారు. ఆయన మృతితో కొల్చారం మండలంలోని పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన సేవలను గుర్తుచేసుకుంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు

## సీఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ బొల్లం సత్తయ్యకు నివాళులర్పించిన డా.రసమయి బాలకిషన్



**బెజ్జంకి,ఆగస్టు 9,(జనంసాక్షి):** మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన సీఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ బొల్లం సత్తయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో, ఆయన మృతదేహానికి మానకొండూరు మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ రసమయి బాలకిషన్ ఆదివారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం సత్తయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి,వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. దేశ భద్రత కోసం ఎంతో నిబద్ధతతో విధులు నిర్వహించిన బొల్లం సత్తయ్య సేవలు చిరస్మరణీయమని, ఆయన మృతి కుటుంబ సభ్యులకు తీరని లోటని డా.రసమయి బాలకిషన్ అన్నారు. సత్తయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ,కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్ రెడ్డి,సీనియర్ నాయకులు లింగాల లక్ష్మణ్,బెజ్జంకి సర్పంచ్ బొల్లం శ్రీధర్,మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి,శ్రీనివాస్ గుప్తా,లక్ష్మారెడ్డి,ఎల శేఖర్ బాబు,పవన్, పోచయ్య,శంకర్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బోనాలు

**రేగోడు, ఆగస్టు09 (జనంసాక్షి):** ఆషాఢం చివరి మాసం పురస్కరించుకొని రేగోడ్ మండల పరిధిలోని జగిర్యాల గ్రామంలో ఆదివారం విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో బోరంచ పోచమ్మ అమ్మవారికి బోనాలు ఘనంగా భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సమర్పించడం జరిగిందని విశ్వకర్మ సంఘం సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా ఆదివారం మహిళలు గ్రామాల్లో బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి ప్రత్యేకంగా అలంకరించిన బోనాలతో అమ్మవారి ఆలయాలకు చేరుకున్నారు.డప్పు చప్పుళ్లు, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయాలను పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించగా భక్తులతో పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి. అమ్మవారి కృపతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని భక్తులు ప్రార్థించారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.


## ఘనంగా దుర్గామాత, ఊరడమ్మా అమ్మవార్ల బోనాల ఉత్సవాలు





**కోహీర్, ఆగస్టు 9 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల పరిధిలోని చింతల్‌గట్టు గ్రామంలో దుర్గామాత, ఊరడమ్మా అమ్మవార్ల బోనాల ఉత్సవాలను ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులు నైవేద్యాలు సమర్పించారు.
స్థానిక మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలను శిరస్సు పై ఎత్తుకుని మంగళవాయిద్యాలు, డప్పు చప్పుళ్ల నడుమ ఆలయం వరకు ఊరేగింపుగా తరలివచ్చారు. అనంతరం అమ్మవార్లకు బోనాలను నైవేద్యంగా సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

## బురద రోడ్డుతో ఇబ్బందులు



**సంగారెడ్డి, ఆగస్టు 9 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా వట్టిల్లి మండలంలోని భూత్కూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు బురదగా మారడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఈ మధ్యన కురుస్తున్న వర్షాలకు నడవలేని స్థితిలో ఉండడంతో బూత్కూరు గ్రామానికి చెందిన మాజీ వార్డ్ సభ్యులు దేవుని శామయ్య రోడ్డుపై నాట్లు వేస్తూ నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి స్పందించి బూత్కూర్ గ్రామానికి రోడ్డు మంజూరు చేయాలని కోరారు.

## బెజ్జంకిలో ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు




**బెజ్జంకి,ఆగస్టు9,(జనంసాక్షి):** మండల కేంద్రంలో ఆదివారం యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు కర్రావుల సందీప్ ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శాన గొండ శరత్ కుమార్ హాజరై యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. యువతను కాంగ్రెస్ పార్టీ వైపు మరింతగా సమీకరించి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని శానకొండ శరత్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చిలాపూర్ గ్రామశాఖ అధ్యక్షులు నవీన్, బేగంపేట యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రాజగాని ప్రవీణ్, బొనగం రమేష్,రాగటి రవి,బొర్రా సందీప్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గడికోటలో అమ్మవారికి వైభవంగా బోనాలు..



**పెద్ద శంకరంపేట, ఆగస్టు 9.(జనంసాక్షి):** పెద్ద శంకరంపేటలోని గడికోట దుర్గామాత అమ్మవారికి ఆదివారం సాయంత్రం వైభవ బోనాలు నిర్వహించారు. శ్రీ సరస్వతి శిశు మందిర్ (దేవుడి) నుండి భాజా భజంత్రీలతో మహిళలు బోనాల నేత్తిన పెట్టుకొని శివసత్తులు నృత్యాలతో పట్టణ పురవీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి గడికోటలోని అమ్మవారికి సమర్పించారు. ఉదయం శ్రీ సరస్వతి శిశు మందిర్ నుండి అమ్మవారి చిత్రపటం. తొట్టెలను ఊరేగింపుగా గడికోట కు చేరుకొని అమ్మవారికి వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్ఛారణలతో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండేలా ఆశీర్వదించండి

- **పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు**
- **పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



**సంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 9 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బాగా వర్షాలు పడి రైతుల పంటలకు అధిక దిగుబడి వచ్చేలా ఆశీర్వదించాలని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి బిహెచ్ఇఎల్ టౌన్షిప్ లోని పెద్దమ్మ తల్లిని వేడుకొన్నారు. బోనాలపండగ ఉత్సవాల సందర్భంగా ఆదివారం బిహెచ్ఈఎల్ టౌన్‌షిప్ లోని అమ్మవారి గుడిలో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకప్పుడు ఈ ప్రాంతానికే పరిమితమైన పెద్దమ్మ తల్లి ఆలయం అందరి కృషివల్ల దినదినాభివృద్ధి చెంది నేడు హైదరాబాద్ నగరంలోనే ప్రసిద్ధి చెందినదని కొనియాడారు. ఇంకా అభివృద్ధి చెందాలని, అందుకు తమ సహకారం ఉంటుందని వెల్లడించారు. ఈ సందర్భంగా మొదట ఎమ్మెల్యేకు ఆహ్వానముపలికిన కమిటీ ఉపాధ్యక్షుడు రాజేశ్వరాచారి, కోశాధికారి విశ్వనాథం, ప్రచార కార్యదర్శులు వేణు, మాణిక్రెడ్డి, సభ్యులు బాస్కర్, మధు, దేవార్జున, తదితరులు ఎమ్మెల్యేని శాలువాలతో ఘనంగా సన్మానించారు. అంతకు ముందు ఎమ్మెల్యేతో పాటు ఆయన అనుచర జనం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆషడమాసం బోనాల ఉత్సవాలు చివరిరోజు కావడంతో మహిళలు, భక్తులు భారీ సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు పలువురని ఆకట్టుకున్నాయి. కమిటీ వైస్ ఛైర్మన్ రాజేశ్వరాచారి, సెక్రెటరీ ప్రవీణ్, కోశాధికారి విశ్వనాథం, ప్రచార కార్యదర్శులు వేణు గోపాల్, మాణిక్ రెడ్డి, కిషన్,స్వామి, వీణ నారాయణ, దేవార్జున, దేవేంద్ర చారి. భాస్కర్, మధుసూదన్, రాము,కరుణాకర్,శివకుమార్,నాగరాజు,రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## జిపి భవనానికి భూమి పూజ చేసిన సర్పంచ్



**మల్దకల్, ఆగస్టు 9 (జనంసాక్షి):** మండల పరిధిలోని అమరవాయి గ్రామంలో ఆదివారం రూ.20 లక్షలతో నిర్మించే గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆదేశాలతో గ్రామ సర్పంచ్ తూము కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి గోపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ రంగన్న, వార్డు మెంబర్లు నాగన్న, ఎల్లప్ప, గ్రామస్తులు రమేష్ రెడ్డి, మహేష్, ఆంజనేయులు, బుడ్డన్న, ఉప్పరి గోపాల్, తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ నిధులతో నిర్మించే గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వారు కోరారు.

## ఎద్దుల బండినీ ఢీ కొట్టి... యువకుడు మృతి



**మిడ్జిల్, ఆగస్టు 8(జనంసాక్షి):** మండలంలోని రాణిపేట గ్రామ శివారులో జడ్చర్ల కల్వకుర్తి ప్రధాన రహదారిపై ఆదివారం ఉదయం బైక్ పై వెళ్తున్న యువకుడు ఎద్దుల బండిని వెనుక నుండి ఢీకొనడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది ఎస్సై శ్రీనివాస్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బోయిన్పల్లి గ్రామానికి చెందిన బన్నీ వయసు 21 సంవత్సరాలు జడ్చర్ల పోలేపల్లి ప్రైవేట్ కంపెనీలో జాబ్ చేస్తూ డ్యూటీ ముగించుకొని ఉదయం తెల్లవారుజామున ఏడు గంటల సమయంలో తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో రానీపేట గ్రామ శివారు లో దర్గా సమీపంలో చిలువేరు గ్రామానికి చెందిన మల్లయ్య ఎడ్ల బండితో మిడ్జిలు వైపు వస్తుండగా బైక్ పై వస్తున్న బన్నీ వెనక నుండి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు తండ్రి యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జడ్చర్ల ఏరియా హాస్పిటల్ తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పజెప్పినట్లు ఎస్సై తెలిపారు.

**టోల్గేట్ వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రాణాల బలి...**

మిడ్జిల్ మండల పరిధిలోని మున్ననూరు గ్రామ శివారులో జడ్చర్ల. కల్వకుర్తి ప్రధాన రహదారిపై టోల్గేట్ కు సంబంధించిన అంబులెన్స్ లో పనిచేస్తున్న వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో అనేక మంది ప్రాణాలు పోతున్నాయని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అనేక ప్రమాదాలు జరిగిన వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రాణాలు పోయాయని అదేవిధంగా ఆదివారం ఉదయం ఎద్దుల బండికి ఢీ కొట్టిన బన్నీ ప్రాణాలు అలాగే పోయావని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగి అరగంట అయినప్పటికీ ఫోన్ చేసిన టోల్గేట్ అంబులెన్స్ లో పనిచేస్తున్న వైద్య సిబ్బంది స్పందించకపోవడంతో నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. అందుబాటులో ఉంటే ప్రాణాలు దక్కే పరిస్థితి ఉందని ఇకనైనా పై అధికారులు టోల్గేట్ అంబులెన్స్ లో పనిచేస్తున్న వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకొని రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తులకు చికిత్స అందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## చేర్యాలలో ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



**చేర్యాల, ఆగస్టు 09 (జనంసాక్షి):** యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చేర్యాల మండల కేంద్రంలో ఆదివారం పాత బస్టాండ్ వద్ద ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు భూమని బాలరాజు అధ్యక్షత వహించారు. ముందుగా పార్టీ నాయకులు జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జనగామ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కర్క సంతోష్ రెడ్డి మాట్లాడుతూ.. యువజన కాంగ్రెస్ స్థాపించిన నాటి నుండి యువత హక్కుల కోసం, ప్రజా సమస్యల కోసం నిరంతరం పోరాడుతోందని అన్నారు. యువత రాజకీయాల్లో చురుగ్గా పాల్గొని దేశ, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం యువజన కాంగ్రెస్ సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బుడిగే రమేష్, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఆరుట్ల వినీత్,మేడిచేల్మి రాకేష్, ఇమ్మడి రాజు, నాయకులు సందీప్, వినయ్, సంతోష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై బైక్ ను ఢీకొన్న కారు...

- **ఒకరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు**



**పెబ్బేరు, ఆగస్టు 9 (జనంసాక్షి):** పెబ్బేరు జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చేరారు. ఎస్ఐ వెంకటేష్ గౌడ్ కథనం ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున పట్టణ సమీపంలోని డబల్ బెడ్ రూమ్ నుండి పెబ్బేరు కు వస్తున్న క్రమంలో కడప నుండి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు బైక్ ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో దినసరి కూలీ శ్రీనివాసులు శెట్టి (42) అక్కడికక్కడే మృతి చెందారు. హమాలి పనిచేస్తున్న తెలుగు బాలకృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ బాలకృష్ణను పట్టణ బి ఆర్ ఎస్ అధ్యక్షులు దిలీప్ రెడ్డి మిత్ర బృందం మహబూబ్నగర్ ఎస్వీఎస్ కు తరలించి మెరుగైన చికిత్సను అందించారు. ప్రమాదంలో మృతి చెందిన శ్రీనివాసులు శెట్టి కి భార్యతో పాటు కూతురు ఉన్నారు. ప్రమాదానికి గురైన వీరి ఆర్థిక పరిస్థితి కోట గడవడమే కష్టంగా ఉండడం వల్ల పలువురు సానుభూతి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ గౌడ్ తెలిపారు.

## తిమ్మాయిపల్లి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా పోచమ్మ బోనాలు



**నంగునూరు, ఆగస్టు 9 (జనంసాక్షి):** నంగునూరు మండల తిమ్మాయిపల్లి గ్రామంలో ఆషాఢ మాసం చివరి ఆదివారం సందర్భంగా రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా మహిళలు భక్తి శ్రద్ధలతో బోనాలతో గ్రామ దేవత పోచమ్మకు మొక్కలు చెల్లించి చివరగా పోచమ్మ తల్లికి ఊరేగింపుగా శివసత్తుల పూనకాలతో డప్పుచప్పులతో వెళ్లి వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకుంటూ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షులు చల్లారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని పాడిపంటలు సమృద్ధిగా పండాలని పోచమ్మ అమ్మవారిని వేడుకోవడం జరిగిందని అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చేర్యాల రాజు ,రెడ్డి సంఘం సభ్యులు, మహిళలు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

# చేర్యాల మాజీ ఎమ్మెల్యే గొర్రె సిద్దయ్య మృతి

- నివాళులర్పించిన రాజకీయ ప్రముఖులు
- 1978లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన సిద్దయ్య




**చేర్యాల, ఆగస్టు 09 (జనంసాక్షి):** 261 చేర్యాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గొర్రె సిద్దయ్య (95) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం తెల్లవారుజామున హైదరాబాదులోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ధూళ్మిట్ట మండలంలోని బైరాన్ పల్లి గ్రామానికి చెందిన సిద్దయ్య గతంలో చేర్యాల నియోజకవర్గం నుంచి 1978 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ తరపున ఏడు వేల పై చిలుకు ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. నాటి నుంచి చేర్యాల ప్రాంతానికి అనేక సేవలు అందించారు. ప్రస్తుతం ఆయన కుటుంబం హైదరాబాదులో నివసిస్తున్నారు. ఆయన మృతి పట్ల పలువురు రాజకీయ పార్టీల నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జనగామ నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి హైదరాబాదులో సిద్దయ్య పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

# మాటలతో కాదు.. పనులతో చూపిస్తున్న సర్పంచ్

- జాలపల్లిని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న చెట్కూరి



**చేర్యాల /ధూళ్మిట్ట, ఆగస్టు 09 (జనంసాక్షి):** ఎన్నికల్లో గ్రామస్తులకు ఇచ్చిన హామీలను మాటలతో కాకుండా చేతల్లో చూపిస్తూ ధూళ్మిట్ట మండలం జాలపల్లి గ్రామ సర్పంచ్ చెట్కూరి కమలాకర్ ప్రజల మన్ననలు పొందుతున్నారు.

భారీ మెజారిటీతో గెలిచి ప్రజల బాధలు తీర్చి, సర్పంచ్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపొంది, ఏడాది కాలం పూర్తి కాకుండానే గ్రామంలో ప్రతి పనిలో ముందుండి సర్పంచ్ కమలాకర్ అభివృద్ధి పనులు చేపడుతున్నారు.

**సర్పంచ్‌కు సీపీఐ నాయకుల అభినందనలు...**

సర్పంచి చేస్తున్న కృషిని అభినందిస్తూ సీపీఐ పార్టీ ధూళ్మిట్ట మండల కన్వీనర్ వలబోజు నర్సింహా చారి స్థానిక సర్పంచ్ కమలాకర్ ఎల్లవేళలా గ్రామ సమస్యలపై దృష్టి పెట్టి వెంటనే పరిష్కరిస్తున్నారని కొనియాడారు. గ్రామ పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. వర్షాకాలంలో రోడ్ల పక్కన పేరుకుపోయే చెత్త, గడ్డిని ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఎప్పటికప్పుడు తొలగింపు పనులు చేయిస్తున్నారు. గ్రామంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అందమైన రోడ్లు నిర్మించి గ్రామానికి సుందరీకరణ తీసుకొచ్చారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో నిజమైన అర్హులకే కేటాయింపులు జరిగేలా చూస్తున్నారు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా సస్పెన్స్ లేకుండా సత్వరమే పరిష్కరిస్తున్నారని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ సేవలను గుర్తించిన గ్రామ ప్రజలు చెట్కూరి ఆంజనేయులు, గుండెల్లి సంపత్, యాసరేణి బాలరాజు, జక్కు కొమురయ్య, తుపాకుల బాలయ్య తదితరులు అభినందించారు. జాలపల్లి గ్రామ అభివృద్ధిలో సర్పంచ్ కమలాకర్ కృషి చిరస్మరణీయమని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

# నేటితో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి

- ఆగస్టు 17న డ్రాఫ్ట్ ఎలక్టోరల్ ప్రచురణ
- అడిషనల్ కలెక్టర్ సంగీత



**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 9(జనంసాక్షి):** భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిబంధనల ప్రకారం, పారదర్శకంగా పూర్తి చేస్తున్నట్లు అడిషనల్ కలెక్టర్ సంగీత తెలిపారు.

**ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంగీత మాట్లాడుతూ...**

ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణ గడువు పొడిగించడంతో ప్రక్రియను పూర్తి చేసేందుకు అదనపు సమయం లభించిందన్నారు. ఆగస్టు 10లోపు ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌తో పాటు పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించారు. ఆగస్టు 17న డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ ప్రచురించనున్నట్లు తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై క్లెయిమ్స్, అభ్యంతరాలను ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు స్వీకరిస్తామని, వాటిని నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. ఏఎస్‌డీ జాబితాలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి రెండు రోజుల్లోగా ప్రక్రియను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం 1,200కు పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్ల వద్ద అవసరమైన చోట కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు కోసం రేషనలైజేషన్ చేపట్టినట్లు వివరించారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ప్రస్తుతం 1,633 పోలింగ్ స్టేషన్లు ఉండగా, రేషనలైజేషన్ అనంతరం 1,649 పోలింగ్ స్టేషన్లను ప్రతిపాదించినట్లు తెలిపారు. అంటే కొత్తగా 16 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటును ప్రతిపాదించినట్లు వెల్లడించారు. జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ సగటున 79 శాతం పూర్తయిందని తెలిపారు.

**నియోజకవర్గాల వారీగా డిజిటలైజేషన్....**

నారాయణఖేడ్ నియోజకవర్గం – 88%
ఆందోల్ నియోజకవర్గం – 87%
జహీరాబాద్ నియోజకవర్గం – 82%
సంగారెడ్డి నియోజకవర్గం – 80%
పటాన్‌చెరు నియోజకవర్గం – 67%

ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ పాండు పాల్గొన్నారు.

# ఆగస్టు 15న భారీ భజన కార్యక్రమం

- వేల గొంతులు.. ఒకే భజన
- కరపత్రం విడుదల చేసిన రామభక్త భజన పరివార్



**మెదక్ టౌన్, ఆగస్టు 9 (జనంసాక్షి):** మెదక్ పట్టణంలోని చమన్ వద్ద వున్నా హనుమాన్ దేవాలయంలో సమాజ ఐక్యతను చాటేలా ఆగస్టు 15న మెదక్ పట్టణంలో భారీ భజన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు భారీ భజన కార్యక్ర మం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రామభక్త భజన పరివార్ సభ్యులుతో పాటు భజన భక్తులు కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను శనివారం విడుదల చేశారు. రామభక్త భజన పరివార్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం చామన్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఐదో వారం భజన కార్యక్రమాన్ని ఆగస్టు 15న సాయంత్రం 5 గంటలకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి వేలాది మంది భక్తులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భక్తులు, హిందూ బంధువులు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. భజన కార్యక్రమం ద్వారా హిందువుల ఐక్యత, ధార్మిక చైతన్యాన్ని చాటాలని పిలుపునిచ్చారు.

## అంగరంగ వైభవంగా బోనాల ఊరేగింపు




**రాయికోడు,ఆగస్టు 9, (జనంసాక్షి):** మండల పరిధిలోని జంబిగి, మహ్మదాపూర్, రాయిపల్లి తదితర గ్రామాలలో ఆషాఢ మాసం చివరి ఆదివారం కావడంతో గ్రామ దేవతలకు అంగరంగ వైభవంగా బోనాల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నుండి ఆయా గ్రామాలలోని అమ్మవారి దేవాలయాలలో రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. తదనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని మహిళలు డప్పు చప్పుళ్ళు భాజా భజంత్రీలతో పోతరాజుల విన్యాసాలు ఆటపాటలతో అమ్మవారికి బోనాలు సమర్పించి తమ తమ మొక్కులను చెల్లించుకున్నారు తదనంతరం ఆయా గ్రామాలలో అన్నప్రసాద కార్యక్రమం చేపట్టారు. ఆయా గ్రామాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్సై చైతన్య కిరణ్, మాజీ ఎంపీపీ శారద భాయ్ బసవరాజ్ పటేల్, పలు గ్రామాల సర్పంచులు ప్రజాప్రతినిధులు ఆయా గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో ఘనంగా ముదిరాజ్ బోనాల పండగ

- ఆకట్టుకున్న పోతురాజులు విన్యాసాలు
- హాజరైన కాంగ్రెస్ సీనియర్ రాష్ట్ర పులిమామిడి రాజు



**సంగారెడ్డి, ఆగస్టు 09(జనంసాక్షి):** సంగారెడ్డి పట్టణంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సామూహిక బోనాల వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డిలోని ఐబీ వద్ద నుంచి ప్రారంభమైన బోనాల ఊరేగింపు ఆలయం వరకు చేరుకుంది. పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు అమ్మవారికి బోనాల సమర్పించారు. ఊరేగింపులో అమ్మవారి శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

వివిధ కళాకారుల ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. డప్పు వాయిద్యాల మోతతో ఊరేగింపు ఉత్సాహభరితంగా సాగింది. కోలాటాల బృందాలు తమ ప్రదర్శనలతో సందడి చేశాయి. ముఖ్యంగా జారి పొడవున పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి ఎమ్మెల్యే కంటెస్టెడ్ అభ్యర్థి, కాంగ్రెస్ సీనియర్ రాష్ట్ర పులిమామిడి రాజు ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు జనార్ధన్, ప్రధాన కార్యదర్శి పిట్టల రమేష్, సర్పంచ్ సతీష్, కౌన్సిలర్ వెంకట రమణ, మాజీ కౌన్సిలర్ మందుల నాగరాజు, మాజీ సర్పంచ్ విజయ బాస్కర్, ఎస్ వి శ్రీను, రామకృష్ణ, తిర్మల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆర్య వైశ్య సంఘం ఎన్నికల్లో నామ కిరణ్ ఘన విజయం

- సమాజ సేవకు దక్కిన గౌరవం



**జహీరాబాద్ ,ఆగస్ట్ 09(జనంసాక్షి):** జహీరాబాద్ ఆర్య వైశ్య సంఘం ఎన్నికల్లో నామ కిరణ్ అత్యధిక మెజారిటీతో విజయాన్ని సాధించారు. ఆదివారం వాసవి కల్యాణ మండపంలో వైశ్య సంఘం ఎన్నికలు నిర్వహించారు.మొత్తం సంఘం లో 316 ఓట్లు ఉండగా 304 ఓట్లు నమోదయ్యాయి.సంఘం అధ్యక్ష,కార్యదర్శి మరియు కోశాధికారి పదవులకు ఎన్నికలు జరిగాయి.ఈ ఎన్నికల్లో రెండు ప్యానల్లగా నామ కిరణ్ అధ్యక్షులు గా ,కార్యదర్శిగా మాడిశెట్టి శ్రీనివాస్ ,కోశాధికారిగా బదంపేట్ శ్రీనివాస్ ఒకప్యానెల్,అల్లాడి నర్సింలు అధ్యక్షులుగా,పోటీపల్లి శ్రీనివాస్ కార్యదర్శిగా,అల్లాడి వీరేశం కోశాధికారిగా ఇంకో ప్యానల్ గా బరిలో దిగారు.

అధ్యక్షులుగా పోటీలో వున్న నామ కిరణ్ కు 189 ఓట్లు రాగ అల్లాడి నర్సిములు కు 112 ఓట్లు పోలయ్యాయి .కార్యదర్శి మేడిశెట్టి శ్రీనివాస్ కు 158 ఓట్లు పోలవ్వగా పొట్టుపల్లి శ్రీనివాస్ కు 146 ఓట్లు పోలయ్యాయి.కోశాధికారిగా బదంపేట్ శ్రీనివాస్ కు 176 ఓట్లు పోలవ్వగా అల్లాడి వీరేశం కు 128 ఓట్లు లభించాయి .సమాజ సంక్షేమం, ఐక్యత మరియు సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా వారు అందించిన సేవలకు గాను సభ్యులందరూ మద్దతుగా నిలిచి ఈ ఘన విజయాన్ని కట్టబెట్టారు.

వాసవి కల్యాణ మండపం అభివృద్ధి,ఆర్య వైశ్య సోదరుల పురోగతి, విద్యార్థులకు ప్రోత్సాహకాలు, మరియు ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవడం వంటివి ప్రచారం కిరణ్ కు సంఘం సభ్యులు ఆదరణ చూపించారు.

ఈ సందర్భంగా నామ కిరణ్ మాట్లాడుతూ సంఘంలోని ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేస్తూ పారదర్శకతతో కూడిన కార్యక్రమాలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.సమాజ శ్రేయస్సే నా మొదటి ప్రాధాన్యత. నాపై నమ్మకం ఉంచి గెలిపించిన ఆర్య వైశ్య బంధువులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.అందరి సహకారంతో సంఘాన్ని మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్తానని అన్నారు.

# మాతృమూర్తుల ఆరోగ్యమే లక్ష్యం...

• గర్భిణీల ఆరోగ్యానికి రాజన్న' పోషకాహార భరోసా..320 మందికి పోషకాహార కిట్లు • 21 గ్రామాల గర్భిణులకు పోషకాహార కానుక...
• నేడు కొల్చారం మండల కేంద్రంలోని బాబా గార్డెన్‌లో...

**కొల్చారం, ఆగస్టు 9 (జనంసాక్షి):** నేడు కొల్చారం మండల కేంద్రంలోని బాబా గార్డెన్లో ఉదయం 9 గంటలకు కొల్చారం పీహెచ్సీ పరిధిలోని 13 గ్రామాలకు చెందిన మూడు నెలలు దాటిన, ఏడు నెలలోపు గర్భిణీ మహిళలకు న్యూట్రిషన్ ప్రోటీన్ కిట్లను నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలోని ఆవుల రాజన్న ఫౌండేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నర్సాపూర్ నియోజకవర్గంలో కొన సాగుతున్న స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో భాగంగా గర్భిణీ మహిళలకు పోషకాహార కిట్లను పంపిణీ చేయనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు రంగంపేటలోని శ్రీ భ్రమ రాంబ మల్లికార్జున ఫంక్షన్ హాల్‌లో రంగం పేట పీహెచ్‌సీ పరిధిలోని ఎనిమిది గ్రామాలకు చెందిన గర్భిణీ మహిళలకు కిట్లను పంపిణీ చేయనున్నారు.

కొల్చారం, రంగంపేట రెండు పీహెచ్‌సీల పరిధిలోని 21 గ్రామాలకు చెందిన సుమారు 320 మంది గర్భిణీ మహిళలకు ఈ పోషకాహార కిట్లను అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, గ్రామ సర్పంచులు, మండల కార్యవర్గ సభ్యులు, ముఖ్య నాయకులు తమ గ్రామాల్లోని ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లతో సమన్వయం చేసుకుని గర్భిణీ మహిళలను కార్యక్రమానికి తీసుకురావాలని ఆవుల రాజిరెడ్డి కోరారు.

# యువత భవిష్యత్తుతో చెలగాటమా..?

• కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల యువజన వ్యతిరేక విధానాలను తిప్పికొడతాం
• ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల శంకర్




**బెజ్జంకి,ఆగస్టు 9,(జనంసాక్షి):** మండల కేంద్రంలో ఆదివారం ఏఐవైఎఫ్ మండల 4వ మహాసభను మండల మాజీ అధ్యక్షుడు బోనగిరి శ్రావణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఏఐవైఎఫ్ జెండాను జిల్లా ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల శంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరుస్తూ, కాంట్రాక్టీకరణ, ఔట్‌సోర్సింగ్ విధానాలను ప్రోత్స హిస్తూ శాశ్వత ఉద్యోగ అవకాశాలను కుదిస్తోందని ఆరోపించారు. నాలుగు లేబర్ కోడ్లు,ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ,ఉద్యోగ నియామకాల్లో జాప్యం, విద్యా, వైద్య రంగాల వాణిజ్యీకరణ వంటి విధానాలు యువత భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉద్యోగ నియామకాల ప్రక్రియను వేగవంతం చేయడంలో, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ఆశించిన పురోగతి సాధించలేదని విమర్శించారు.యువతకు ఇచ్చిన హామీలను కార్యరూపంలోకి తీసుకు రావడానికి ప్రభుత్వం నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.సెప్టెంబర్ 8,9,10 తేదీల్లో యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్టలో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలు,యువజన సమస్యల పరిష్కారం,విద్య-ఉపాధి హక్కుల సాధన, రాజ్యాంగ విలువల పరిరక్షణ, ప్రజాస్వామ్య-లౌకిక భారత నిర్మాణం కోసం నూతన కార్యాచరణకు రూపకల్పన చేయనున్నాయి అనీ శంకర్ అన్నారు.ఈ మహాసభలో సీపీఐ బెజ్జంకి మండల కార్యదర్శి బోనగిరి రూపేష్,ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్,నాయకులు మిద్దె రవి, నరేష్, రాకేష్, బాబు, చరణ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# నల్లపోచమ్మ అమ్మవారి బోనాల్లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి

• ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్న ఎమ్మెల్యే



**నారాయణఖేడ్, (జనంసాక్షి):** మానూర్ మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బోరంచ గ్రామంలో కొలువుదీరిన శ్రీ నల్లపోచమ్మ అమ్మవారి ఆషాఢ మాస బోనాల వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనాల మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ..** ఆషాఢ మాస బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, రైతులు ఆనందంగా ఉండాలని శ్రీ నల్లపోచమ్మ అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. నారాయణఖేడ్ నియోజకవర్గ ప్రజలపై అమ్మవారి కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. బోనాల సందర్భంగా బోరంచ గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భోజిరెడ్డి, సర్పంచ్ బీరప్ప కురుమ, ఆలయ చైర్మన్ మల్లప్ప, ఆలయాధికారి శివరుద్రప్ప, అఖిలేష్‌రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గీతన్నల చైతన్య రాష్ట్ర బస్సుయాత్ర విజయవంతం చేయాలి

• కల్లుగీత కార్మిక రాష్ట్ర కార్యదర్శి రమేష్ గౌడ్



**టేక్మాల్, ఆగస్ట్ 9 (జనంసాక్షి):** కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన గీతన్నల చైతన్య రాష్ట్ర బస్సు యాత్రను విజయవంతం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్. రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆగస్టు 13న టేక్మాల్ మండల పరిధిలోని బొడ్మట్ పల్లి కి రాష్ట్ర బస్సుయాత్ర చేరుకోనున్న సందర్భంగా టేక్మాల్ మండల కేంద్రంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ గీత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. కల్లుగీత వృత్తి సంక్షేమం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో 5 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. వనమహోత్సవంలో భాగంగా గీత కార్మికులందరూ ఈత, తాటి చెట్ల పెంపకాన్ని చేపట్టాలని కోరారు. ఆగస్టు 2న మహబూబాబాద్‌లో ప్రారంభమైన ఈ చైతన్య బస్సు యాత్ర రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతోందని తెలిపారు. టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లిలో యాత్రకు స్వాగతం పలుకుతూ భారీ బైక్ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని కల్లుగీత కార్మికులు, గౌడ సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ యాత్ర ఆగస్టు 18 వరకు కొనసాగి హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ముగుస్తుందని రమేష్ గౌడ్ తెలిపారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్, వెంకటేశం గౌడ్, యాద గౌడ్, మనోహర్ గౌడ్,సత్య గౌడ్, రాజేశ్వ గౌడ్, సాయ గౌడ్, రాజు గౌడ్, శివ గౌడ్, మల్ల గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంఇఎఫ్ 5వ మహాసభకు మాదిగ ఉద్యోగులు

• వర్గీకరణతో 59 ఉపకులాలకు న్యాయం జరుగుతుంది
• ఎంఇఎఫ్ జిల్లా నాయకులు దేవరపాగ ప్రభాకర్



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 9(జనంసాక్షి):** ఒంగోలులో నిర్వహిస్తున్న మాదిగ ఉద్యోగుల సమాఖ్య 5వ మహాసభకు నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి పలువురు మాదిగ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.మహాసభలో మాదిగ ఉద్యోగుల సమస్యలు, సామాజిక న్యాయం, ఎస్సీ వర్గీకరణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా నుంచి ఉద్యోగులు హాజరై తమ సంఘీభావాన్ని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ ఫలాలు 59 ఉపకులాలకు న్యాయం చేసే విధంగా ఉండటం సామాజిక న్యాయ సాధనలో ఒక ముఖ్యమైన ముందడుగు అని వారు పేర్కొన్నారు. మాదిగ ఉద్యోగులు ఐక్యంగా ఉండి తమ హక్కులు, సామాజిక అభివృద్ధి కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎంఇఎఫ్ మహాసభకు జిల్లా నుంచి తరలివెళ్లిన వారిలో ఆది సురేందర్, కాళ్ల ప్రసాద్, ఎల్లపోగు లక్ష్మయ్య, సైదులు బాలక్షమయ్య, పాండు, బాలస్వామి, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

# ఘనంగా యువజన కాంగ్రెస్ 66వ ఆవిర్భావ దినోత్సవం



**మక్తల్, ఆగస్టు 9(జనంసాక్షి):** భారత యువజన కాంగ్రెస్ 66వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం మక్తల్‌లో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ అధ్యక్షుడు, మండల అధ్యక్షుల చేతులమీదుగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ చిత్రపటాలకు నివాళులర్పించి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇందిరా గాంధీ యువతను రాజకీయాల్లోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ఉద్యోగాల హామీ నెరవేర్చలేదని, అగ్నివీర్, పేపర్ లీకులతో యువతకు అన్యాయం చేసిందని విమర్శించారు. 2029 ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మానస, మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, సీనియర్ నాయకులు కట్ట సురేష్, లక్ష్మారెడ్డి యువజన కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామ సమస్యలు ప్రజలకు తెలియాల్సిందే

• అల్లాపూర్ సర్పంచ్ నారాయణ యాదవ్




**మునిపల్లి, ఆగస్టు 9 (జనంసాక్షి):** తమ గ్రామంలోని సమస్యలు మంచి చెడు ఏదైనా గ్రామ ప్రజలకు తెలియాల్సిందేనని అల్లాపూర్ సర్పంచ్ అంకెనపల్లి నారాయణ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మునిపల్లి మండలంలోని అల్లాపూర్ గ్రామంలో ప్రతి వార్డులో సౌండ్ స్పీకర్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి సంబంధించిన అభివృద్ధి , సమస్యలు ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని ఉద్దేశంతో గ్రామంలోని వార్డు వార్డుకు సౌండ్ స్పీకర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామానికి సంబంధించిన ఏ విషయమైనా మైక్ ద్వారా సందేశం అందించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా వినూత్నంగా కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరూ అర్థం చేసుకొని సహకరించాలని కోరారు. సర్పంచ్ వెంట ఉప సర్పంచ్ బాబు సాబ్ వార్డ్ వార్డ్ మెంబర్లు, గ్రామ ప్రజలు ఉన్నారు.

### నవాబుపేటలో విజయవంతంగా

# 98వ వారం ఉచిత భోజన కార్యక్రమం





**నవాబుపేట, ఆగస్టు 9 (జనంసాక్షి):** నవాబుపేట మండల కేంద్రంలో జేకే (JK) కుటుంబ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత భోజన కార్యక్రమం ఆదివారం నాటికి విజయవంతంగా 98వ వారానికి చేరుకుంది. ప్రతి ఆదివారం మండల కేంద్రానికి జరిగే వారపు సంత (అంగడి) కొరకు చుట్టుపక్కల ఉన్న దాదాపు 70 గ్రామాలు, తండాల నుండి వేలాది మంది ప్రజలు తరలివస్తుంటారు.
సంతకు వచ్చే పేద, ఎగువ తరగతి ప్రజల ఆకలి తీర్చడమే ధ్యేయంగా జేకే కుటుంబ ట్రస్ట్ ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తోంది. ఈ వారం కూడా సంతకు వచ్చిన ప్రజలందరికీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా జేకే ట్రస్ట్ చైర్మన్, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు మాజీ మండల ఏఎంసీ (A.M.C) చైర్మన్ వి.నరసింహ చారి మాట్లాడుతూ.. గత 98 వారాలుగా ఈ ఉచిత భోజన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే ప్రజలకు సేవ చేయడం తమ ట్రస్ట్ ఆశయమని, భవిష్యత్తులోనూ ఈ సేవా కార్యక్రమాలు ఇలాగే కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు, స్థానిక నాయకులు మరియు స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న సప్తాహ అఖండ భజన



**మల్దకల్,ఆగస్టు 9(జనంసాక్షి):** సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండి రైతులు సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తూ ఆదిశిల క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం రెండో రోజు మల్లెందొడ్డి,ఐజ, బింగిదొడ్డి,చిన్న తాండ్రపాడు, మంగంపేట, పెద్దొడ్డి, పర్దిపురం గ్రామాల చెందిన భజన భక్తాదులు, సప్తాహ భజన కార్యక్రమంలో పాల్గొనగా ఆలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీ కృష్ణమాన్య పట్వారి ప్రహ్లాదరావు,ఈవో సత్యచంద్రారెడ్డి,పూజారులు ఆధ్వర్యంలో జరుగుతుంది.వరుణ దేవుని కరుణ ప్రతి ఒక్కరికి ఉండాలని శ్రీ తిమ్మప్ప స్వామి ఆశీస్సులతో సుభిక్షంగా వర్షాలు కురవాలని ప్రార్థించారు. అనంతరం అన్నదాన సత్రంలో భజన భక్తులకు ఆరిగిద్ద గ్రామానికి చెందిన విద్యుత్ కాంట్రాక్టర్ రాముడు కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ప్రతి ఆషాఢ మాసం చివరిన ప్రారంభమై శ్రావణమాసం మొదటి వారంలో ముగిస్తుంది. ఈ కార్యక్రమంలోహార్మోనిస్ట్ రాఘవేంద్రచారి, చంద్రశేఖర రావు,రామచంద్రారెడ్డి, రామసుబ్బారెడ్డి, ప్రసాదాచారి, వీరారెడ్డి,భజన మండలి సభ్యులు,వాల్మీకి పూజారులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన గురుకులాల్లో పార్ట్‌టైమ్ ఉపాధ్యాయుల నియామకం

**విద్యార్హతలు...**
డిగ్రీ లెక్చరర్ పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. అదే సబ్జెక్టులో పీహెచ్.డి. ఎన్ ఈ టి/సెట్/ అర్హత కలిగిన అభ్యర్థులకు వరుసగా ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. పిజిటి పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌తో పాటు దీ.జు.న. బి.ఎడ్ ఉత్తీర్ణులై ఉండాలి. టీజీటీ పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో డిగ్రీతో పాటు బి.ఎడ్ ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ (పిడి) పోస్టుకు ఏదైనా డిగ్రీతో పాటు బిపి హెడ్/బిపి ఈడి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 11న ఉదయం 9.00 గంటలకు రీజనల్ కోఆర్డినేటర్, గిరిజన సంక్షేమ గురుకుల కార్యాలయం, మానసాహిల్స్, రాజేంద్రనగర్, రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు జిరాక్స్ సెట్లతో డెమో, ఇంటర్వ్యూకు హాజరు కావాలని రీజనల్ కోఆర్డినేటర్ నర్సింగ్ రావు తెలిపారు. బాలికల విద్యాలయాల్లో కేవలం మహిళా అభ్యర్థులకు మాత్రమే అవకాశం కల్పించబడుతుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సంగారెడ్డి జిల్లా డి సి ఓ సెల్ నెంబర్ 9849237238 సంప్రదించాలని సూచించారు.

# ఘనంగా కోట మైసమ్మ బోనాలు



**మిడ్జిల్, ఆగస్టు 8(జనంసాక్షి):**
మండలంలోని వేముల గ్రామంలో కోట మైసమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉత్సవాల్లో భాగంగా మహిళలు యువతులు బోనాలను అలంకంచుకొని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు కార్యక్రమంలో సర్పంచ్ నాగమ్మ గ్రామస్తులు పాండు యాదవ్ ఆంజనేయులు శ్రీనివాసులు రవి నరేష్ శ్రీను గ్రామ యువకులు పెద్దలు పాల్గొన్నారు.

# "చదువుకు పేదరికం, కులం అడ్డుకాదు"



**కేసీఆర్ హయాంలో దళిత విద్యార్థుల కోసం గురుకుల పాఠశాలలు పెంచాం...**
సిద్దిపేటలో ఎస్సీ మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ తెచ్చాం. అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్షిప్, దళిత బంధు లాంటి అద్భుతమైన కార్యక్రమాలు చేశామన్నారు. కానీ ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ కు బడ్జెట్ లో 5,403 కోట్లు కేటాయించి, ఖర్చు పెట్టింది కేవలం 74 కోట్లు మాత్రమే. ఆ 74 కోట్లు కూడా జీతాలు, కరెంట్ బిల్లులకే సరిపోయాయి. ఈ ప్రభుత్వంలో ఏ ఒక్క నిరుపేద దళిత యువకుడికి గానీ, రైతుకు గానీ ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పైసా సహాయం అందలేదు. దళితబంధు కింద 12 లక్షలు ఇస్తామని చెప్పి, బడ్జెట్ లో 2000 కోట్లు పెట్టి.. ఏ ఒక్కరికైనా ఒక్క రూపాయి సహాయం చేశారా? ఎస్సీ, ఎస్టీ ఎస్డీఎఫ్ నిధులు ల్యాప్స్ కావొద్దని, క్యారీ ఫార్వర్డ్ కావాలని మేము చట్టం తెస్తే.. ఈ ప్రభుత్వం 2024-25 లో 33 వేల కోట్లు ఎస్సీ నిధి కింద చూపి, ఖర్చు చేసింది కేవలం 14 వేల కోట్లే. అందులో పెన్షన్లు అన్నీ కలిపి ఖర్చుగా చూపిస్తున్నారు. మాదిగ, మాల, ఏకలవ్య, సేవాలాల్, కొమురం భీమ్, బీసీ కార్పొరేషన్లు అని పేర్లు పెట్టి కాగితాలకే పరిమితం చేశారు తప్ప.. ఆ కార్పొరేషన్లకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడం శోచనీయమని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్‌లు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు రోడ్డున పడుతున్నారు. ప్రభుత్వంలో పదేళ్లలో 19 వేల కోట్లు ఫీజు రీయింబర్స్మెంట్ కింద చెల్లించి పిల్లల చదువులకు ఆటంకం లేకుండా చూశాం. ఇప్పుడు డిగ్రీలు, ఇంజనీరింగ్ పూర్తయినా కాలేజీలు సర్టిఫికెట్లు ఇవ్వక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థుల హక్కుల కోసం, నిధుల కోసం అసెంబ్లీలో మేము కొట్లాడుతాం. విద్యావంతులైన మీరు కూడా ఈ ప్రభుత్వం చేస్తున్న ద్రోహాన్ని గమనించాలన్నారు

**విద్యార్థులు బాగా చదవాలి చదువుకు పేదరికం, కులం అడ్డుకాదు...**
పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని నాలుగైదేళ్లు క్రమశిక్షణతో కష్టపడితే మీ భవిష్యత్తు అద్భుతంగా ఉంటుంది. మీరు గొప్ప ఆఫీసర్లుగా ఎదిగి మీ తల్లిదండ్రులు, మన సిద్దిపేట గర్వపడేలా చేయాలని మనసారా దీవిస్తున్నానని అన్నారు.

# రైస్‌మిల్లులో లారీ రేషన్ బియ్యం పట్టుకున్న ఆశన్‌పల్లి గ్రామస్తులు

- **సమగ్ర విచారణ జరపాలిద: గవినోళ్ల శ్రీనివాస్**



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు 9(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా దామర్‌గిద్ద మండలం ఆశన్‌పల్లి గ్రామంలో గతంలో అధికారులు సీజ్ చేసిన రైస్ మిల్లులో ప్రభుత్వ రేషన్ బియ్యం నిల్వలు ఉన్నట్లు గ్రామస్తులు గుర్తించి శనివారం రాత్రి పట్టుకున్నారు. పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అధికారులు ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఉంచిన బియ్యం నిల్వలను పరిశీలించారు. ఈ బియ్యం ప్రభుత్వం ప్రజలకు సరఫరా చేసే రేషన్ బియ్యమేనని అధికారులు పేర్కొన్నట్లు గ్రామస్తులు తెలిపారు. అంతేకాకుండా బియ్యం ఉన్న సంచులను కూడా మార్చకుండా లాట్‌ల వారీగా సీజ్ చేసిన రైస్‌మిల్లు లోనే నిల్వ చేసినట్లు గుర్తించారు. ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని రాత్రి సమయంలో సంచులు మార్చి బయ ట మార్కెట్‌కు తరలించి విక్రయించేందుకు కొంత మంది దళారులు ప్రయత్నించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అయితే గ్రామస్తులు అప్రమత్తమై బియ్యాన్ని గుర్తించడంతో వారి ప్రయత్నం విఫల మైంది. ఇప్పుడు ఈ బియ్యం మరికల్‌కు చెందిన రైస్ మిల్లు బియ్యం అని, దానికి సంబంధించిన వే బిల్లులు ఉన్నాయని కొంద రు అధికారులు చెబుతు న్నారని గ్రామస్తులు పేర్కొం టున్నారు. అయితే మరికల్ రైస్ మిల్లుకు చెందిన బియ్యం అయితే, అది దామర్‌గిద్ద మండలం ఆశన్‌పల్లి గ్రామంలోని గతంలో అధికారులు సీజ్ చేసిన రైస్‌మిల్లులో ఎందుకు నిల్వ ఉంది? అనే ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాలని తెలంగాణ రక్షణ సేన పార్టీ నారాయ ణపేట జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు జియో ట్యాగింగ్, ఆన్‌లైన్ ట్రాకింగ్, వే బిల్లులు వంటి వ్యవస్థలు అమలు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ, అసలు బియ్యం ఎక్కడి నుంచి వచ్చింది? ఎక్కడికి తరలించాల్సి ఉంది? సీజ్ చేసిన మిల్లులోకి ఎలా చేరింది? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందన్నారు. బియ్యం సంచులపై ఉన్న లాట్ నంబర్లు, స్టాక్ రిజిస్టర్లు, వే బిల్లులు, మిల్లుల రికార్డులు, రేషన్ బియ్యం సరఫరా వివరాలు, వాహ నాల రవాణా వివరాలను అధికారులు పరిశీలించాలని ఆయన కోరారు.
ప్రభుత్వానికి చెందిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించి వ్యాపారం చేస్తున్న వారితోపాటు, వారికి సహకరిస్తున్న అధికారులు ఎవరైనా ఉంటే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేశారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్త వాలను ప్రజల ముందు ఉంచాలని గవినోళ్ల శ్రీనివా స్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రేషన్ బియ్యం పేద ప్రజలకు అందాల్సిందని, దానిని అక్రమంగా బయట మార్కె ట్‌కు తరలించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఆయన స్పష్టం చేశారు.

# హర్ ఘర్ తిరంగా - తిరంగా యాత్రను విజయవంతం చేయండి

- **బీజేపీ మండల అధ్యక్షులు వడ్లకొండ సంజీవులు గౌడ్**



**చేర్యాల, ఆగస్టు 09 (జనంసాక్షి):** భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించనున్న 'హర్ ఘర్ తిరంగా – తిరంగా యాత్ర' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ చేర్యాల మండల అధ్యక్షులు వడ్లకొండ సంజీవులు గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం చేర్యాల మండల కేంద్రంలోని శ్రీ వింధ్య జూనియర్ కాలేజీలో బీజేపీ మండల అధ్యక్షులు వడ్లకొండ సంజీవులు గౌడ్ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బల్ల శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ నెల 12న చేర్యాల మండల కేంద్రంలో నిర్వహించనున్న తిరంగా యాత్రలో యువత, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశ సమగ్రత, ఐక్యతను చాటే విధంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని అన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయడం ద్వారా దేశభక్తి భావనను మరింత బలోపేతం చేయాలని, స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నర్ర మహేందర్ రెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి కాశెటి పాండు, బిజెపి సీనియర్ నాయకులు మన్నె సత్యవర్ధన్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి తౌట బాలరాజు, బీజేపీ మండల ఉపాధ్యక్షులు బియ్యారపు యాదగిరి,అప్పల బాబు ,చల్ల బాల్రెడ్డి, సమ్మయ్య , బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కల్వకుంట్ల మనీష్, బీజేవైఎం నాయకులు సోగాల మనోజ్ కుమార్, పొనబోయిన అనిల్ కుమార్, వెలుగుల వినయ్, బీజేపీ బూత్ అధ్యక్షులు గుంటి రాములు ,జాలిగామ రమేష్, కూరపాటి నర్సింహులు,కేతోజి సాయి కుమార్ చారి, కుమార్,చేన్నమల్లు రాజు, మారబోయిన మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ అరుణను కలిసిన మైనార్టీ మోచ్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహబూబ్ అలీ



**నారాయణపేట, ఆగస్టు 8(జనంసాక్షి):** రాష్ట్ర మైనార్టీ మోచ్చ ఉపాధ్యక్షుడు మహబూబ్ అలీ  హైదరాబాద్‌లో పాలమూరు ఎంపీ డి కే అరుణను మర్యాదపూ ర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి రావడానికి సహకరించి నందుకు ఎంపీ కి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన విశ్వాసాన్ని వమ్ముచేయకుండా బిజెపి మైనార్టీ మోచ్చను పటిష్టం చేస్తానని రాబోయే ఎన్నికల్లో బీజేపీ విజయానికి కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే.రతంగ్ పాండురెడ్డి, పగుడాకుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## 10న వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగే జైల్ బరో కార్యక్రమాన్ని జయప్రదం చేద్దాం

**అమరచింత, ఆగస్టు 9(జనంసాక్షి):** పట్టణ కేంద్రంలో రేపటి జైల్ భరో కార్యక్రమాన్ని .అఖిల భారత రైతు సంఘం. ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం. టి.యు. సి. ఐ. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జయప్రదం చేయాలని. అమరచింత పురవీధుల గుండా కరపత్రాలను పంచుతూ జైల్ బరో కార్యక్రమా నికి కార్మికులు కర్షకులు వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ యొక్క కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం వనపర్తి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే.రాజన్న. జి.వెంకటయ్య అఖిలభారత ప్రగతిశీల వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు. ప్రసాద్. జిల్లా నాయకులు. మసల మాని. కార్మికులు రైతులు.కురుమన్న. ఏసన్న. కుర్మానాయక్. రఫిక్. తదితరులు పాల్గొన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రైతు చట్టాలను స్వాతంత్రం నుంచి సాధించుకున్న చట్టాలన్నింటినీ కేంద్ర ప్రభుత్వాశీ హక్కులు లేకుండా చేస్తున్నాయి. ఈ దేశ సంపదనంతా ఆదాని అంబానీలకు తాకట్టు పెడుతూ కార్మికుల్ని బానిసలుగా రైతుల్ని మరింత పేదలుగా మార్చడానికి ప్రభుత్వాలు కంకణం కట్టుకున్నాయి స్వాతంత్ర ఉద్యమ కాలంలో క్విట్ ఇండియా ఉద్యమం పేరుతో ఈ దేశానికి వలస వచ్చిన బ్రిటిష్ వాళ్ళను భారతదేశాన్ని వదులుకోవాలని అన్ని వర్గాల ప్రజలు క్విట్ ఇండియా పేరుతో ఈ దేశాన్ని వదలండి లేదంటే మమ్ములను జైల్లో పెట్టండి అనే నినాదంతో దేశ ప్రజలందరూ రోడ్లమీదకి రావడంతో స్వాతంత్ర ఉద్యమం ఊపందుకుంది అన్ని వర్గాల ప్రజలు స్వాతంత్రములో భాగస్వాములు అయినారు ఆంగ్లేయులు మన



దేశాన్ని వదిలిపెట్టి స్వాతంత్రం రావడానికి మన దేశ ప్రజలు నడుం బిగించడం జరిగింది. మనకు స్వాతంత్రం రావడం జరిగింది. భారతదేశానికి స్వాతంత్రం వచ్చినప్పటికీ 79 సంవత్సరములు పూర్తి చేసుకున్నప్పటికీ సాధించుకున్న చట్టాలను అన్నింటి కూడా హరించి కార్మికులను మరింత బానిసలుగా మార్చే విధంగా ఈ ప్రభుత్వాలు చేస్తున్నాయి దేశంలో నిరుద్యోగం తాండవిస్తుంది పని భద్రత లేదు ఉద్యోగ భద్రత లేదు సిఫారసులను అమలు చేయడం లేదు ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశంలో అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జైలు భరో కార్యక్రమాన్ని పిలుపునివ్వడం జరిగింది. అందులో భాగంగా సోమవారం వనపర్తి లో జరిగే బోయే జైలు బరో కార్యక్రమాన్ని కార్మికులు రైతులు రైతు కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జైల్ బరో కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా డిమాండ్. చేశారు.

## మైపాల్ రెడ్డి తల్లి లక్ష్మీ ఆత్మకు శాంతి చేకూరాలి

- **మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు**

**తూప్రాన్, ఆగస్టు 9(జనంసాక్షి):**
కాంగ్రెస్ నాయకుడు చిట్కుల్ మైపాల్ రెడ్డి  తల్లి లక్ష్మీ  ఆత్మకు శాంతి చేకూరాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు మెదక్ ఎమ్మెల్యే మైనాపల్లి డాక్టర్ రోహిత్ రావ్ తెలిపారు. మైపాల్ రెడ్డి తల్లి సంవత్సరీకానికి హాజరైన ఎమ్మెల్యే డా.మైనంపల్లి రోహిత్ పూలమాల వేసి నివాళులు అర్పిం చారు. సంవత్సరీక కార్యక్రమం నేడు మనోహరాబాద్‌లోని శుభం గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెదక్ శాసనసభ్యులు డా.మైనంపల్లి రోహిత్ గారు ముఖ్య అతిథిగా హాజరై, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. దివంగతుల ఆత్మకు శాంతి



చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ మనోహరా బాద్ వివిధ మండలాలకు చెందిన  నాయకులు, ధర్మేందర్, జావీద్, అప్సర్, నర్సింగరావు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## గోమారంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గాల ఘర్షణ

- **ఇరు వర్గాలను చెదరగొట్టిన పోలీసులు**



**శివ్వంపేట, ఆగస్టు 9 (జనంసాక్షి):** శివ్వంపేట మండలం గోమారం గ్రామంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులకు ఫ్లెక్సీ వివాదంగా రగడకు దారితీసి గ్రామంలో ఘర్షణ వాతావరణం నెలకొన్నది. వివరాలలోకి వెళితే బోనాల ఉత్సవాల సందర్భంగా ఆదివారం బీఆర్ఎస్ నాయకులు ఫ్లెక్సీ ఏర్పాటు చేసుకున్నారు. అయితే దానికి అడ్డుగా కాంగ్రెస్ నాయకులు కావాలని కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఘర్షణకు దిగారు. వెంటనే పోలీసులు రంగప్రవేశం చేసి సీఐ వెంకటరాజాగౌడ్, ఎస్ఐ మధుకర్ రెడ్డిల ఆధ్వర్యంలో ఇరువర్గాలను చెదరగొట్టి ఉద్రిక్త పరిస్థితులను తగ్గించారు. ఇదిలా ఉంటే బీఆర్ఎస్ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ కావాలనే కాంగ్రెస్ నాయకులు దౌర్జన్యంతో మేము ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ కనిపించకూడదనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఫ్లెక్సీ అడ్డుగా వేయడం జరిగిందని, ప్రశ్నించిన పాపానికి దౌర్జన్యంతో దాడులు చేశారని విలేకరులకు తెలిపారు. ఘరణ సందర్భంగా గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా  పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## దేశ భవిష్యత్తుకు యువతే బలమైన పునాది

- **దేశభక్తి, నిస్వార్థ సేవతో భారత్‌ను విశ్వగురువుగా తీర్చిదిద్దాలి**
- **ఆర్ఎస్ఎస్ పాలమూరు విభాగ్ సహకారవాహ బోగారం సూర్యనారాయణమూర్తి**

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో,ఆగస్టు 9 (జనంసాక్షి):**
దేశభక్తి, నిస్వార్థ సేవాభావంతో పనిచేస్తే భారత యువత దేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దగలదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) పాలమూరు విభాగ్ సహకారవాహ బోగారం సూర్య నారాయణమూర్తి అన్నారు. దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు.ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బిజినపల్లి మండలం పాలెంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన యువ సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం, సామాజిక బాధ్యత వంటి విలువలను యువత తమ జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు.యువతలో స్వబోధ ను మేల్కొల్పడంతో పాటు పౌర బాధ్యత, సామాజిక సామరస్యం, కుటుంబ విలువలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉంద న్నారు. వ్యక్తిగత ప్రయోజనాలకు మాత్రమే పరిమితం కాకుండా దేశ నిర్మాణ స్ఫూర్తితో యువత ముందుకు సాగితే 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవించగలదని పేర్కొన్నారు. ఇందుకు ప్రస్తుత జాతీయ వాతావరణం అనుకూలంగా ఉందని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దేశభక్తిని అంతర్గతంగా అల వర్చుకోవడంతో పాటు సమాజం పట్ల కర్తవ్య భావాన్ని పెంపొం దించుకోవాలని కోరారు.ఆర్ఎస్ఎస్ శతాబ్ది ప్రస్థానాన్ని ప్రస్తావించిన సూర్యనారాయణమూర్తి, సంస్థ స్థాపించబడిన నాటి నుంచి హిందూ సమాజాన్ని ఏకం చేయడం, బలోపేతం చేయడం, సమాజంలో సేవా భావాన్ని పెంపొందించడం వంటి లక్ష్యాలతో నిరంతరం పనిచేస్తోం దన్నారు. యువత అభివృద్ధి చెందిన భారతదేశానికి రూపశిల్పులుగా ఎదగాలని, వ్యక్తిగత ఆశయాలకు అతీతంగా శీలం, క్రమశిక్షణ, సేవా



భావంతో జాతీయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. బలమైన సమాజ నిర్మాణం కోసం ఆర్ఎస్ఎస్ ప్రతిపాదిస్తున్న పంచ పరివర్తన్ అంశాలను చిత్తశుద్ధితో అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్వబోధ్, నాగరిక్ కర్తవ్య, పర్యావరణ సురక్ష, సామాజిక సమరసత, కుటుంబ ప్రబోధన్ వంటి అంశాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టినప్పుడు సమాజంలో సానుకూలమైన, శాశ్వతమైన మార్పు సాధ్యమవుతుందని తెలిపారు. వ్యక్తి పరివర్తన ద్వారానే కుటుంబం, సమాజం, దేశంలో మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

**సామాజిక మాధ్యమాలకు బానిసలు కావొద్దు:**
కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ యువ న్యాయవాది ధనాల పూర్ణిమ మాట్లాడుతూ యువత సామాజిక మాధ్యమాల్లో విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. దేశభక్తి, కర్తవ్యనిష్ఠ, సామాజిక సేవాభావం, జాతీయ చైతన్యాన్ని పెంపొందించుకోవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో విభాగ్ సహ వ్యవస్థ ప్రముఖ్ ఆగపు నాగయ్య, ధర్మజాగరణ ప్రముఖ్ అతినారపు ఆంజనేయులు, జిల్లా పర్యావరణ ప్రముఖ్ పబ్బతి నిరంజన్‌తో పాటు వివిధ హిందూ సంఘాల కార్యకర్తలు, విద్యార్థులు, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకర్తలు, యువత తదితరులు పాల్గొన్నారు.

## వందేమాతరం స్ఫూర్తితో కదిలిన యువత

**తెలకపల్లి, ఆగస్టు 09 (జనం సాక్షి):** వందేమాతరం గేయం రచించబడి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తెలకపల్లి మండల కేంద్రంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం యువ సమ్మేళనం ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల



నుంచి యువజన సంఘాల సభ్యులు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రధాన వక్తగా పాల్గొన్న పుల్లరి నాగకృష్ణ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతరం గేయం, నినాదం యావత్ జాతిని ఏకతాటిపైకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించాయని వివరించారు.
దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది యువకిశోరులు తమ కోరికలను త్యజించి, దేశం కోసం జీవితాలను అర్పించారని తెలిపారు.
**అసోసియేట్ ప్రొఫెసర్ జగన్ మాట్లాడుతూ..** నేటి యువత చెడుదారులకు దూరంగా ఉంటూ, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువతలో దేశభక్తి, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఎల్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రకాశ్ రెడ్డి, సంగిశెట్టి చంద్రశేఖర్, ముడావత్ శ్రీనివాసులు, యర్రగిన్నెల రవికుమార్, కాసోజు వెంకటాచారి, ఏబీవీపీ నాయకులు, యువకులు వెంకటేష్, మహేష్, అరవింద్, సాత్విక్, నరేష్‌తో పాటు పలువురు యువత పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే మేఘారెడ్డిని ప్రశంసించిన విషయాన్ని గుర్తు చేసుకోవాలి

- **మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్**

**వనపర్తి బ్యూరో, ఆగస్టు 9 (జనంసాక్షి):** బీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండారు శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డిని మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి గతంలో ప్రశంసించిన విషయాన్ని ఆ పార్టీ నాయకులు గుర్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే మేఘారెడ్డికి ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై పూర్తి అవగాహన ఉందని, అయితే ప్రాజెక్టులపై సరైన అవగాహన లేకుండా బీఆర్ఎస్ నాయకులు అవహేళనగా మాట్లాడటం సరికాదని అన్నారు. వనపర్తి రాజకీయాలకు మేధావులు, విద్యావేత్తలు, విద్యావంతులు నెలవుగా ఉండటంతో ఇక్కడ రాజకీయాలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రాజకీయ విలువలకు విరుద్ధంగా బీఆర్ఎస్ నాయకులు వ్యవహరించడం విచారకరమని బండారు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. పరుష పదజాలంతో విమర్శలు చేయడం, దిగజారుడు రాజకీయాలకు పాల్పడటం సరికాదని హితవు పలికారు. గతంలో టీఆర్ఎస్ నాయకుల మాటలు విని తమకు ఓటు వేసినందుకు ప్రజలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో ఆవేదన



వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలపై నిర్మాణాత్మకంగా మాట్లాడాలని, వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉండాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు.

# జాతీయస్థాయిలో ప్రతిభ కనబరచాలి: డాక్టర్ జి.చిన్నారెడ్డి

- **విజయవంతమైన 72వ స్టేట్ సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు ముగింపు**
- **ఆసక్తికరంగా సాగిన పురుషులు, మహిళల పోటీలు**

**వనపర్తి బ్యూరో, ఆగస్టు 9 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు సెప్టెంబర్ మాసంలో శ్రీకాళహస్తిలో జరిగే జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో ప్రతిభ కనబరిచి ట్రోఫీ సాధించాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి క్రీడాకారులకు సూచించారు.

మూడు రోజుల పాటు వనపర్తి లో జరిగిన 72వ రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ గవర్నమెంట్ ముగింపు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి వి వి రమణ , వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి రమేష్ ,బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సలహాదారుడు శ్రీనివాసరావు, వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మన్మోహన్రావు వెంకట్రాంరెడ్డి ఆర్గనైజింగ్ కార్యదర్శి భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు. రాష్ట్రం నలుమూలల నుండి వనపర్తి లో జరిగిన టోర్నమెంట్లో పాల్గొన్న వివిధ జిల్లాల క్రీడాకారులను చిన్నారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. క్రీడాకారులు క్రీడా ప్రతిభను కనబరచడంతో పాటు, విడాస్ఫూర్తిని చాటాలన్నారు. ఆగస్టు 7 నుంచి 9 వరకు నిర్వహించిన 72వ స్టేట్ సీనియర్ మెన్ అండ్ ఉమెన్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఆదివారం ఘనంగా ముగిసింది. మూడు రోజుల పాటు జరిగిన టోర్నమెంట్‌లో పురుషులు, మహిళల విభాగాల్లో క్రీడాకారుల మధ్య హోరాహోరీ పోటీలు జరిగాయి. పురుషలలో 1ర్ ప్లేస్ వరంగల్ 2 హైదరాబాద్ 3 కరీంనగర్



విజయం సాధించారు. అలాగే మహిళలలో 1ర్ ప్లేస్ రంగారెడ్డి 2అదిలాబాద్ 3 వరంగల్ సాధించారు. సమన్వయం, క్రీడాస్ఫూర్తితో పోరాడారు. ప్రతి మ్యాచ్‌లోనూ ఉత్కంఠభరిత వాతావరణం నెలకొంది.

మూడు రోజుల పాటు జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నిర్వాహకులు అభినందించారు. రాష్ట్రస్థాయిలో బాల్ బ్యాడ్మింటన్ క్రీడకు మరింత ప్రోత్సాహం లభించేలా ఇటువంటి టోర్నమెంట్లు దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. టోర్నమెంట్ ముగింపు సందర్భంగా విజేతలు, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు, నిర్వాహకులు, కోచ్‌లు, క్రీడాకారులు, అభిమానులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్ ద్వారా సీనియర్ స్థాయి క్రీడాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు మంచి వేదిక లభించిందని, భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరింత ప్రతిభ కనబరచాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

# రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి

**అయిజ, ఆగస్టు 09(జనంసాక్షి):** అయిజ మండలం ఏక్లాస్‌పురం గ్రామానికి చెందిన వెంకటేష్ కుటుంబంలో తీవ్ర విషాదం. వెంకటేష్ కుమార్తె ఎంబిబిఎస్, రాజమహేంద్రవరంలో చదువుకుంటుంది. రాజమహేంద్రవరంలో కారుతో ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన వైద్య విద్యార్థిని డాక్టర్ ప్రియాంక(28) ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు కన్నుమూశారు. కుమార్తెను కోల్పోయిన విషాదంలోనూ ఆమె తల్లిదండ్రులు అవయవదానానికి అంగీకరించడం గొప్ప మానవత్వానికి నిదర్శనమని గ్రామ సభ్యులు తెలిపారు. ఈ విషయంపై ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వానికి విద్యార్థిని తండ్రి ఫిర్యాదు చేశారు. ప్రియాంక ఘటనపై హోంమంత్రి ఆరా ప్రియాంక తండ్రి వెంకటేష్‌తో ఫోన్‌లో మాట్లాడిన అనిత. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఈ కేసులో ఇప్పటికే నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు కూడా తరలించారని చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటున్నాం అని హోంమంత్రి అనిత తెలిపారు.



# శృంగేరి పీఠం శిక్షణ శిబిరంలో ఉమాపతి ఆచార్యులకు ప్రశంసా పత్రం

**తెలకపల్లి, ఆగస్టు 9 (జనంసాక్షి):** కర్ణాటకలోని శ్రీ శృంగేరి శారదా పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు రోజుల పద్య రచన, సాహితీ, పురోహిత శిక్షణా శిబిరంలో మండల కేంద్రానికి చెందిన అర్చక పురోహితులు మారోజు ఉమాపతి ఆచార్యులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. శిక్షణా శిబిరంలో ప్రతిభ కనబరిచిన ఉమాపతి ఆచార్యులకు శృంగేరి పీఠాధిపతుల ఉత్తరాధికారి శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామి చేతుల మీదుగా ఆది వారం ప్రశంసా పత్రం అందజేశారు. జగద్గురువుల ఆశీర్వచనం పొంద డం తనకు ఎంతో పుణ్యఫలమని ఉమాపతి ఆచార్యులు పేర్కొన్నారు.



అద్వైత మత స్థాపనాచార్యులు శ్రీ ఆదిశంకరాచార్యులు స్థాపించిన శ్రీ శృంగేరి శారదా పీఠం ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణా కార్యక్రమం ఆధ్యా త్మిక, సాహితీ రంగాల్లో తనకు ఎంతో ప్రోత్సాహాన్ని అందించిందని తెలిపారు. జగద్గురువుల ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

# రేపు పటాన్‌చెరులో పాత్రికేయుల సమావేశం

- **టియుడబ్ల్యూ (జేఐజేయు) జిల్లా అధ్యక్షులు యాదగిరి**

**సంగారెడ్డి, ఆగస్టు 9(జనంసాక్షి):** తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ టీయుడబ్ల్యూజే (ఐజేయు) పటాన్‌చెరు నియోజకవర్గ పాత్రికేయుల సర్వసభ్య సమావేశం ఈనెల 11 మంగళవారం ఉదయం 11 గంటలకు రామచంద్రాపూర్‌లోని లక్ష్మీ గార్డెన్స్‌లో జరుగుతుందని జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఆర్.అనిల్ కుమార్ తెలిపారు. పాత్రికేయుల సమస్యలు, యూనియన్ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తామని అన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలం, హెల్త్ కార్డుల విషయం కూడా చర్చించనున్నట్లు వెల్లడించారు. ఇంకా మిగిలిపోయిన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ పాత్రికేయ సంఘాల ప్రతినిధులు హాజరవుతారని, అందరూ సకాలంలో పాల్గొనాలని కోరారు.



# వైభవంగా అప్పాజీపల్లి గ్రామంలో ఆషాఢ బోనాలు

- **భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాల సమర్పణ**
- **ఆకట్టుకున్న శివసత్తుల విన్యాసాలు**

**కొల్చారం, ఆగస్టు 9 (జనంసాక్షి):** కొల్చారం మండలం అప్పాజీపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆషాఢ బోనాల ఉత్సవాలు రెండో రోజు ఆదివారం అత్యంత వైభవంగా కొనసాగాయి. గ్రామ ప్రజలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని దుర్గమ్మ తల్లికి సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నర్సాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు దిగంబర ముదిరాజ్, జిల్లా నాయకులు ధనరాజ్ ముదిరాజ్, ఉపసర్పంచ్ చలం నర్సింలు, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చింతల బాగయ్య, ఉపాధ్యక్షుడు కన్యబోయిన నర్సింలు ముదిరాజ్ వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వారియర్స్ డిఫెన్స్ అకాడమీ, లైన్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ



**నారాయణపేట, ఆగస్టు 9(జనంసాక్షి):** పోలీస్ కానిస్టేబుల్ ఎంపికకు సంబంధించి నారాయణపేట పట్టణంలో నారాయణపేట వారియర్స్ డిఫెన్స్ అకాడమీ -నారాయణపేట లైన్ క్లబ్ 320 ఏ ఆధ్వర్యంలో, కానిస్టేబుల్ ఉచిత కోచింగ్ క్లాసులు స్థానిక ఆసారం భట్టాడ్ లయన్స్ భవన్‌లో విజయవంతంగా నిర్వహించబడుతున్నాయి.

ఈ సందర్భంగా ఆదివారం విద్యార్థిని, విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్ నిర్వహించారు. పోలీస్ కానిస్టేబుల్ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయడంలో భాగంగా క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహిస్తూ, వారి ప్రతిభను, పరీక్షా సన్నద్ధతను అంచనా వేస్తున్నారు. వారియర్స్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ లయన్ రవికుమార్ గౌడ్ పర్యవేక్షణలో కోచింగ్ క్లాసులు దిగ్విజయంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్ర మంలో వారియర్స్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ లయన్ డాక్టర్ ఆంజనేయులు (ఆర్మీ), లయన్ శాంత, లయన్ ఎస్. చక్రవర్తి , లెక్చరర్లు వెంకన్న, శ్రీనివాసులు పాల్గొని విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో, పట్టుదలతో శిక్షణ పొందుతూ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాన్ని సాధించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

# పర్యాటకులకు మత్స్యకారులకు నది తీర ప్రాంతాల వారికి పోలీస్, రెవెన్యూ అధికారుల హెచ్చరిక



**ఎర్రవల్లి, ఆగస్టు9(జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం ఎగువన కురుస్తున్న వర్షాల వలన జూరాల ప్రాజెక్టుకు నీటి ప్రవాహం పెరగడంతో గత వారం నుండి కూడా బీచుపల్లి కృష్ణా నది ఉధృతంగా ప్రవహించడం జరుగుతుంది. ఇందులోనే భాగంగానే పైనుండి వచ్చిన ప్రాణాంతకమైన మొసల్లు (క్రొకోడైల్) నీటి ప్రవాహంలో రావడం జరిగింది పర్యాటకులు మత్స్యకారులు ప్రజలు నది ఒడ్డున స్నానాలు ఆచరించే సమయంలో బహిర్భూమికి వెళ్లే సమయంలో వేటకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని అలాగే స్నానం ఆచరించేవారు అక్కడికి పూజా కార్యక్రమాలకు వచ్చేవారు సమీపంలో ఉన్నమత్స్యకారులు యొక్క సలహాలు సూచనలు మేరక నదిలోకి వెళ్లవలసిందిగా కోరడం జరిగింది. జిల్లా కలెక్టర్, అలంపూర్ సీఐ ప్రదీప్ ఇటిక్యాల ఎస్ఐ రవి ఎమ్మార్వో నరేష్, ఎంపీడీవో పంచాయత్ సెక్రటరీ అరుణ అధికారులు ప్రజలకు తెలియజేశారు.